

పాఠకులకు తాను చెప్పి ఆలోచింపజేయాల్సింది ఏమైనా ఉంటే తప్ప 'శ్రీవిరించి' కథలు రాయరు. ఇదీ అలాంటి కథే.

# వాసంత సమీరం

డైరెక్టర్స్ మీటింగ్‌కు అవసరం అయిన సరంజామా అందిస్తూ, అనేక నగరాలలో ఉన్న తమ ప్రతినిధులు అందించిన సమాచారాన్ని సమీకరించి తన ప్రతిపాదనలకు అనుగుణంగా మలుచుకుంటూ ఆ రోజంతా గడిపేశాడు మూర్తి. ఆరు గంటలు అయిపోయింది. డైరెక్టర్స్ అందరూ ఎవరి బసలకు వాళ్ళు వెళ్ళిపోయారు. ఏం నిర్ణయాలు తీసుకున్నదీ మరునాడు మేనేజింగ్ డైరెక్టర్ తనను పిలిచి చెబితేతప్ప తెలియదు. అయినా, ఈ రోజు కొత్త ఏముంది? అన్నీ తాను తయారు చేసి ఇచ్చిన నోట్స్ ప్రకారంగానే జరుగుతాయి. అన్ని విషయాలూ ఎలా అనుకూలంగా తిప్పుకుని చెప్పుకోవాలో బాగా తెలుసు. ఆమాత్రం తెలియకపోతే ఎం.బి.ఎ. చదువుకోవడం ఎందుకు? మేనేజ్‌మెంట్ కోర్సులంటూ ప్రతి సంవత్సరమూ కనీసం రెండు నెలలు వేలకు వేలు కంపెనీ డబ్బు తగలేయడం ఎందుకు?

గ్రూప్ ఎగ్జిక్యూటివ్ మూర్తి కంపెనీ కారులోనే ఇంటికి వెళ్ళి చన్నీటి స్నానం చేసి సాయంకాలం దుస్తులలోకి మారిపోయాడు. ఏం చేద్దాం ఇప్పుడు - హాయిగా ఏ పనీ పెట్టుకోకుండా శరీరానికి, మనసుకు విశ్రాంతి ఇద్దామా లేక ఎటయినా వెళ్ళి స్నేహితుల్ని కలుసుకుందామా అనుకుంటూ ఉండగానే టెలిఫోన్ మోగింది. ఈ ఫోన్ కాల్ తన సాయంకాలాన్ని నియామకం చేస్తుంది అనుకుంటూనే రిసీవర్ అందుకున్నాడు మూర్తి.

సాంబశివరావు. "వస్తున్నావా, నన్ను రమ్మంటావా?" అనడిగాడు. "మరో పది నిమిషాల్లో మీ ఇంటి ముందు ఉంటాను" అని ఫోన్ పెట్టేశాడు మూర్తి. చాలా రోజులయింది వాళ్ళ ఇంటికి వెళ్ళి. కనీసం వారానికొకసారయినా వాళ్ళిద్దరినీ చూడకపోతే, మనసుకు ఏమిటో వెలితిగా ఉంటుందతనికి.

"రావయ్యా, రా, ఏమిటి బొత్తిగా అపురూపం అయిపోయినావు?" అంటుంది జగదాంబ నాలుగు రోజులు వరసగా తాను కనిపించకపోతే.

"ఏం చేయమంటారు పిన్నిగారూ...ఆఫీసు పని... అలసట... నిన్ననే టూర్ నుంచి వచ్చాను....ప్రతిరోజూ వచ్చి మీ సాయంకాలం పాడుచేయడం ఎందుకని తాత్సారంగా ఉండిపోయాను... తీరా బయలుదేరే సమయానికి ఎవరో విజిటర్స్ వచ్చారు... మీ కాల్ కోసం ఎదురుచూస్తూ ఉండిపోయాను." ఇలా ఏదో సమయానుకూలంగా జవాబు చెప్పివేయడం అతనికి అలవాటు అయిపోయింది.

"అవునయ్యా ఈ వయసులో పని చేయకపోతే, ఇంకెప్పుడు చేస్తావు? నలభై ఏళ్ళు వచ్చేశాయంటే ఆ మనిషి ఇంక పరిపూర్ణుడే. ఇంకెవ్వరూ అడిగేవాళ్ళు ఉండరనుకో" అంటాడు సాంబశివరావు.

మూర్తికి ఆ దంపతులంటే చాలా గౌరవం, ఆత్మీయత. "నేనేం మామూలు శివుడిని అనుకుంటున్నావా? అంబతో కూడిన శివుడిని. మా జగదాంబ నన్ను నడిపిస్తూ ఉంటుంది" అంటాడాయన భార్య గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా. "జీవితంలో ఏమయినా సాధించాననుకున్నా సంపాదించాననుకున్నా సమరసంగా రోజులు వెళ్ళదీస్తున్నాననుకున్నా... అన్నింటికీ ఇల్లాలే కారణం. ఆ సంగతి తెలియకే, తెలిసినా అర్థంకాకే చాలామంది తమ జీవితాలను దుఃఖభాజనం చేసుకుంటారు" అంటాడాయన. సమరస జీవితం గురించి, అన్యోన్యతల గురించి ఆయనకు చాలా కచ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయి.

'కరిష్యే వచనం తవ' అని అర్జునుడు చెప్పినట్లుగా మీరు ఎలా చెబితే అలా చేయాలని నిర్ణయించుకున్నాను. అంతే! అన్నాడు మూర్తి.


జగదాంబ ఇచ్చిన వేడి వేడి కాఫీ తాగి కాస్తంత వక్కపొడి వేసుకుని, "ఇక చెప్పండి" అన్నాడు మూర్తి.

సాంబశివరావు చిన్నగా నవ్వాడు. "నేనేం టాకింగ్ మిషన్ అనుకున్నావా? నువ్వేదో చెబుతావనికదూ నీ కోసం కలవరిస్తూ కూర్చునేది ప్రతిరోజూ" అన్నాడు.

"కుర్రవాళ్ళ దగ్గర్నుంచీ ఉత్తరాలు వస్తున్నాయా?" అనడిగాడు మూర్తి ఆయన ధోరణి మళ్ళించడానికి.

"రాత్రే పెద్దవాడు మాట్లాడాడు. రెండు రోజులయింది అమ్మాయి దగ్గర్నుంచీ ఉత్తరం వచ్చి. చిన్నవాడు రేపో ఎల్లుండో రావాలి" అని జవాబు చెప్పింది జగదాంబ.

"కొత్త సంగీతం ఏమయినా విన్నావా ఈమధ్య?" అనడిగాడు సాంబశివరావు. మూర్తి మార్కెట్‌లోకి వచ్చిన కొత్త ఎల్.పి.లు, క్యాసెట్లు గురించి వివరాలు అందించాడు; కంపెనీ డైరెక్టర్లకు చెప్పినట్లుగానే వాటి గుణదోషాలు గురించి కూడా తన కామెంట్స్ మిళాయించాడు.



చిత్రాలు: పి.ఎస్. బాబు

"మీరు తప్పనిసరిగా వినవలసిన క్యాసెట్లు రెండు ఉన్నాయి. రేపు ఆఫీసుకు వెళ్ళగానే పంపుతాను. మధ్యాహ్నం వినేసి, సాయంత్రం నేను వచ్చేటప్పటికి మీ అభిప్రాయాలు చెప్పాలి. ఆ రెండిట్లో ఒకటి పిన్నిగారికి మరీ ఎక్కువగా నచ్చుతుంది. చూస్తూ ఉండండి."

"ఏమిటది? మహాలక్ష్మి స్తోత్రమా?" అనడిగాడు సాంబశివరావు.

"చెప్పను. మీరే విందురుగాని."

"ఇలాంటి సస్పెన్స్‌లు ఎన్నో చూశాం లేవయ్యా. మరేం తొందరపడకు. అలాగే పంపు. రేపు సాయంత్రానికల్లా దాంట్లో వంకలన్నీ ఏకరువు పెడతానుగా" అంది జగదాంబ.

మూర్తి వాళ్ళిద్దరితోపాటు నవ్వేశాడు.

"అదిసరే నేను చెప్పిన సంగతి ఏమయినా ఆలోచించావా లేదా?" అన్నాడు సాంబశివరావు ఉన్నట్లుండి.

"చాలాసేపు ఆలోచించిన మీదట, ఆ విషయంలో

అంతగా ఆలోచించవలసింది ఏమీలేదని తేలిపోయిందండీ. అందుకని మానేశాను. 'కరిష్యే వచనం తవ!' అని అర్జునుడు చెప్పినట్లుగా మీరు ఎలా చెబితే అలా చేయాలని నిర్ణయించుకున్నాను. అంతే!''

''మొత్తంమీద కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లకు భగవద్గీత క్లాసులు, వేదాంత ఉపన్యాసాలు ఇప్పించడం చాలా లాభించిందన్నమాట!'' అన్నాడు సాంబశివరావు.

''ఇంకొకళ్ళు చెప్పినట్లు చేయడం మంచిదే. కానీ, మనమూ స్వబుద్ధితో ఆలోచించాలి. ఆ పని నవ్యమయిందేనా, నబబయిందేనా అని నిర్ధారణ చేసుకున్న తర్వాతే చేయడం మంచి లక్షణం. సలహాలకేం ఎన్నయినా ఇస్తారు. విన్నప్పుడు అన్నీ ఆమోదయోగ్యంగానే ఉంటాయి. పరస్పర విరుద్ధమైనవే అయినా'' అంది జగదాంబ.

బహు తేలిక విషయాలను క్లిష్టం, సంకీర్ణం చేయడంలో జగదాంబగారు ఆమెకు ఆమే సాటి - అనుకున్నాడు మూర్తి. ఆ మాటలు పైకి అంటే ఆమె నొచ్చుకుంటారని ఊరకుండిపోయాడు.



ఓ ఇరవై రోజుల క్రితం సాంబశివరావు ఓ చిన్న ఉపన్యాసం లాంటిది ఇచ్చాడు. దాని సారాంశం ఏమిటంటే, మూర్తి తన వివాహ విషయంలో ఇంకా ఉపేక్ష చేయడం మంచిది కాదని.

''తెలిసో తెలియకో, చెప్పేవాళ్ళు లేకో, చొరవ తీసుకొని పనిచేసేవాళ్ళు దొరక్కో - ఇంతవరకూ పెళ్ళి సంగతి నీ మనసుకు రాలేదు. సరే! ఇప్పుడైనా మించిపోయిందేముంది? నీమటుకు నీవే జీవితాన్ని సుసంపన్నం చేసుకోవాలి'' అన్నాడు ఆయన. మూర్తికి తల్లిదండ్రులు లేరు. అయినవాళ్ళంటూ ఎవరూ తెలియదు. ఏదో అనాథ ఆశ్రమంలో పెరిగాడు. అదృష్టం కొద్దీ మంచి చదువు, ఉద్యోగం, సంస్కారం - అన్నీ సమకూడాయి.

జీవితంలో బంధాలు, అనుబంధాలు ఏర్పరచుకోవడం కంటే రికామీగా ఉండి, చేతనైన పని చేసుకుంటూ క్లుప్తంగా, కుదిమట్టంగా రోజులు గడుపుకోవడమే మంచిదని అతని ఆలోచన.

పెద్దవాళ్ళ గైడెన్స్ లేకపోవడం వల్ల వివాహ ప్రతిపాదనలు అతనికేమీ రాకుండానే పోయాయి. మనిషి ఎక్కువగా అంతర్ముఖుడే అవడం వల్ల తన గురించి ఎవరితోనూ చర్చించడం, తర్కించడం అతనికి అలవాటు కాలేదు.

''అందరి జీవితాలూ ఒకే మోస్తరుగా నడవవు మూర్తీ. ఎవరికి ఎంతవరకు అవసరమో అంతవరకే అవకాశాలు వస్తాయి. అట్లాగని మనం చేతులు ముడుచుకుని కూర్చోవలసిన అవసరం లేదు. నీకు ఎం.బి.ఎ. చదవమని ఎవరు చెప్పారు? పెద్ద పెద్ద ఉద్యోగాల కోసం పాకులాడమని ఎవరు కోరారు? జీవితంలో అంతస్తు సంపాదించుకోమని ఎవరు బలవంతం చేశారు? అలాగే నీ జీవితాన్ని - సహచరిని - నీవే ఎంచుకోవాలి. నీనుంచే ఆ ఇనిషియేటివ్ రావాలి. ఎవరో ఏదో చెప్పలేదని మనక్కావలసింది తీసుకోకుండా ఊరకుంటామా? అదంత యోగ్యమైన పనా? అన్నిటికీ ఇతరుల మీద ఆధారపడితే ఇంక మన స్వబుద్ధి ఎందుకు?'' ఇలాంటి ఆలోచనలన్నీ ముందుకు తీసుకువచ్చి పెట్టాడు. మూర్తికి తన జీవితంలో కొత్త అధ్యాయం ఆరంభం అవుతున్నట్లు అనిపించింది. అసలు సాంబశివరావు, జగదాంబ వంటి స్వచ్ఛమైన మనుషులతో పరిచయం ఏర్పడడమే తన సుకృతం.

''వివాహం అవసరమా లేదా అనే విషయం మీద రెండు అభిప్రాయాలు లేవు. మనిషి పెరుగుదల, సంపూర్ణ వికాసం కోసం అది తప్పనిసరి. దానికేదో సాంఘిక ఆచారాలు, ఆధ్యాత్మిక విలువలు ఆపాదించి మనవాళ్ళు మామూలు విషయాలను కూడా వికృతంగా, బాదరబందీగా మార్చి వేశారు. అయినా, ఈ చర్చ అనవసరం. నీవేం తెలియనివాడివి కాదు. జాగ్రత్తగా ఆలోచించుకో. పెళ్ళి చేసుకోవడం అవసరం అనుకుంటే నాకు చెప్పు'' అన్నాడాయన.

జీవితానికి అర్థం, పరమార్థం అంటూ వేదాంత పరిభాష తీసుకురావాల్సిన అవసరం లేకుండానే మూడు ముక్కల్లో ఎంతో పరిజ్ఞానం కలిగేట్లు చేశాడు ఆయన మూర్తికి. తాను ఆలోచిస్తూ ఉండగానే సాంబశివరావు ఆ ప్రస్తావన తీసుకురావడం చాలా ఆనందం అనిపించింది మూర్తికి.

**అసలు సాంబశివరావు, జగదాంబ వంటి స్వచ్ఛమైన మనుషులతో పరిచయం ఏర్పడడమే తన సుకృతం అనిపించింది మూర్తికి.**

''అయితే, నేను చెప్పే మాట విను.''

''మాకు తెలిసిన ఆమె ఉన్నారు. పాపం, ఆమె విధివంచితురాలు. అతి చిన్నతనంలోనే ఒక్క కుమార్తెను తన స్వశక్తి మీద ఆధారపడి పెంచవలసిన అవసరం ఏర్పడింది. ఇప్పుడా అమ్మాయికి వివాహం చేయాలనే ప్రయత్నంలో ఉన్నారు...నీవు అంగీకరిస్తే ఒకమారు ఆ అమ్మాయిని చూసే ఏర్పాటు చేస్తాను. తరువాతి విషయం తరువాత'' అన్నాడు సాంబశివరావు.

''నీలాంటివాడు అల్లుడుగా దొరికితే ఆ అమృతవల్లి కష్టాలన్నీ తీరిపోయినట్లే. ఆమె కూతురు - నీ ముందు పొగడడం కాదుగాని - సురక్ష - నిజంగా నీకు తగినది అని నా అభిప్రాయం. ఈ సంవత్సరమే బి.ఎ. పాసయింది. పైకి చదివించాలని ఉంది అమృతవల్లికి. కానీ, అమ్మాయి జీవితం కూడా తన మాదిరి అయిపోగూడదని, మంచి యోగ్యుడైన పిల్లవాడు ఎవరైనా దొరికితే ముడిపెట్టేసి కూర్చుంటానని పదే పదే చెబుతోంది. ఈ పెళ్ళి అయిపోతే అమృతవల్లి జీవితంలో పెద్ద బెంగ తీరిపోయినట్లే'' అంది జగదాంబ.

''ఊరికే ఎందుకు బ్రెయిన్ వాష్ చేస్తావు? మూర్తి చూడడానికి అంగీకరిస్తే - అతనికే అన్ని సంగతులూ తెలుస్తాయి గదా!''

మూర్తి మనసులో సురక్ష అనే పేరు నాటుకుంది. తన జీవితానికి మరో రక్షాకవచం అవుతుందా ఈ అమ్మాయి? ''అమ్మాయికి ఎన్నేళ్ళుంటాయి?''

''ఇప్పుడే బి.ఎ. పాసయింది. అంటే ఇరవై, ఇరవై ఒకటి...''

''నా వయసు ఎంతో మర్చిపోయినట్లున్నారు మీరు'' అన్నాడు మూర్తి.

''వచ్చే డిసెంబర్‌కు నలభై వస్తాయని నీవేగా అన్నావు?''

''మరి! ఆ అమ్మాయికి దాదాపు రెట్టింపు వయసు నాది. ఆ ఆలోచన మీకు రాకపోవడం ఆశ్చర్యం'' అన్నాడు మూర్తి.

''నిజమే. కానీ, నాకు అంత ఆశ్చర్యం అనిపించడం లేదు. వయోభేదం ఎక్కువ అయిన మాట నిజమే. అయినా, నీకు ఇంతవరకు పెళ్ళి కాకపోవడం ఎందువల్లో మాకు తెలుసు కనుక అదేం నాకు అభ్యంతరంగా కనిపించడం లేదు. చదువులు, ఉద్యోగాల మీద అతి శ్రద్ధ ఉన్నవాళ్ళు నలభై ఏళ్ళ దాకా పెళ్ళి చేసుకోకపోవడం ఇప్పుడిప్పుడే మన దేశంలోనూ ఆచారం అయిపోతోంది గదూ?''

''నా సంగతి అలా ఉంచండి. ఆ అమ్మాయికి పాతికేళ్ళ కుర్రవాడిని చేసుకోవాలని ఉండదా?''

''కోరికలు గుఱ్ఱాలయితే....అని సామెత ఉంది. పాతికేళ్ళ కుర్రాడు... ఉద్యోగం



లేని కుర్రాడు... కట్నం కోరే కుర్రాడు... అత్తవారి ఆస్తిపాస్తుల మీద అనవరతం దృష్టిపెట్టుకునే కుర్రాడు... ఇలాంటివాళ్ళు ఎంత మందయినా దొరుకుతారు. కానీ... నీలాంటి యోగ్యుడు...'' అంటూ జగదాంబ చెబుతూ ఉండగానే మూర్తి అడ్డువచ్చాడు. ''ఇంకా మీరు నాపరంగానే ఆలోచించి చెబుతున్నారు.''

''పోనీ, అమ్మృతవల్లి పరంగా ఆలోచించి చెబుతాను. విను. బోలెడంత కట్నం ఇచ్చి పిల్లకు పెళ్ళి చేయలేను. పిల్లకు పెళ్ళి చేయకుండా నాలాగా దౌర్భాగ్యురాలిని చేయలేను, పెళ్ళి అయిన తర్వాత - అంతకుముందే నేను ఎవర్నో ప్రేమించాను, నీతో పెళ్ళి కేవలం నిమిత్తమాత్రం, కావాలంటే నా ఆస్తిలో వాటా, నీ మెయింటెనెన్స్ కోసం డబ్బు తీసుకో. నా దారికి నన్ను వదిలెయ్యి - అనే తన భర్తలాంటివాళ్ళ బారి నుంచి అమ్మాయిని ఎలా రక్షించాలి? వయసులో ఎంతో తేడా ఉంటే మటుకేం, మనసులు కలిసిపోవడంలోనే గదూ వైవాహిక ఆనందం ఉండేది!''

''అయితే, మీరు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చారన్న మాట?'' అన్నాడు మూర్తి.

''నిర్ణయం మాది కాదు మూర్తీ, జగదాంబ చేస్తున్నది కేవలం సూచన మటుకే. నిర్ణయాలు, నిశ్చయాలు నీవి, వాళ్ళవీని'' అన్నాడు సాంబశివరావు.

''ముందు నువ్వు సురక్షను చూడు, అబ్బాయ్. తరువాత మాట్లాడుకుందాం'' అంది జగదాంబ, ఆ ప్రస్తావనకు అప్పటికి తెర వాలుస్తూ.

అమ్మృతవల్లి ఇంటికి వెళ్ళారు సాంబశివరావు - జగదాంబ - మూర్తి ఓ శుక్రవారం సాయంత్రం.

తీర్చిదిద్దిన ఇల్లు. అమ్మృతవల్లి వాళ్ళను ఆదరంగా ఆహ్వానించింది. ముందే చెప్పాడు సాంబశివరావు ఆమె గురించి మూర్తికి. ''ఈ ఇల్లు ఆమె భర్తది. విడాకులతో పాటు ఈ ఇంటి మీద పూర్తి హక్కులూ ఆమెకే ఇచ్చేశాడు. ఇంకా ఇతర ఆస్తి కూడా తగుమాత్రం ఉన్నదనుకో. అతను మాత్రం అమెరికాలో సెటిల్ అయిపోయాడు, పెళ్ళికి ముందు ప్రేమించిన యువతితో సహా. ఇంకో మనిషి గురించి సుతరామూ ఆలోచించవలసిన అవసరం లేదు అనుకునే స్వార్థపరుల కోవకు చెందినవాడు అతను. అమ్మృతవల్లి మాత్రం... అలాగే ఉండిపోయింది. ఆమెకు ఒక్కటే ధ్యేయం: కుమార్తె జీవితంలో ఇలాంటి అవక తవకలు తటస్థపడ గూడదు. భర్త దూరమయిపోయాడని రూఢీ అయినాక తన గురించి కాక కుమార్తె గురించే యోచించడం ఆమెకు అభ్యాసమయిపోయింది.''

''నమస్కారం. రండి. రండి.'' అంది అమ్మృతవల్లి.

> జగదాంబ పరిచయం చేసింది. లేత తమల పాకులా ఉంది సురక్ష. 'నమస్కారం' అంది. సురక్ష చాలా ఫ్రీగా మాట్లాడింది.

సాంబశివరావు, మూర్తి డ్రాయింగ్ రూంలోనే కూర్చుండిపోయారు. జగదాంబ ఆమెతో పాటు బెడ్‌రూంలోకి వెళ్ళింది. ''పోయిన నెలలో నేను చెప్పింది ఇతని గురించే'' అంది రహస్యం చెబుతున్నట్లు.

''ఏమిటి ఇంత అర్థాంతరంగా - ముందు మాటమాత్రమయినా చెప్పకుండా తీసుకువచ్చారు! నేనేమన్నా కాస్త అతిథి సత్కారం చేయాలా, అక్కర్లేదా?'' అంది అమ్మృతవల్లి. ''ఏ సత్కారాలూ అక్కర్లేదు. అమ్మాయి సురక్షను చూపించు, చాలు. అన్నీ వాళ్ళే నిర్ణయించుకుంటారు...ఇదేం పాతకాలపు పెళ్ళి చూపులు అనుకుంటున్నావేమో? కాదు. కాలం మారిపోయింది'' అంది జగదాంబ.

''కాలం మారిపోయిందని మనం ఎంత అనుకున్నా కుర్రవాళ్ళు. వాళ్ళకు అభిరుచులు, ఆలోచనలు ఉంటాయి. అమ్మాయిని తయారుచేయడానికైనా ఓ గంట సమయం కావాలే. కాస్త కాఫీ, ఫలహారాలు...''

''అన్నీ ఆలోచించాం. మా డ్రైవర్ ఈసరికి మీ డైనింగ్ టేబుల్ మీద అన్నీ చేర్చే ఉంటాడు. నీవు సరిచూసుకో చాలు. పోతే, అమ్మాయిని తయారు చేయడం అంటావా...పది నిమిషాలు చాలు. నీవేం చేయనక్కర్లేదు. సురక్షను ప్రత్యేకంగా అలంకరించవలసిందేం లేదు, పుత్తడి బొమ్మ'' అంది జగదాంబ.

అమ్మృతవల్లికి గుండె దడదడగా ఉంది. జగదాంబలో ఎంత విశ్వాసం ఉన్నా - ఈ పనులన్నీ ఆమె తనకు ముందుగానే చెప్పి ఉండవలసింది అని మనసులో గుబులుగానే ఉంది. ''ఎప్పుడో తీసుకువచ్చి నీకు అబ్బాయిని చూపిస్తాం. సురక్ష కూడా ఒప్పుకుంటేనే సుమా. ఇందులో బలవంతం ఏమీ లేదు. ముందు నీకు ఇష్టం అనిపించిన తర్వాతనే అతనితో ఈ ప్రస్తావన చేస్తాం...ఏం అనుకున్నావ్!'' అని ఆమె అంతకు ముందే చెప్పి ఉంచినా.... మరీ ఇంత అర్థాంతరంగా ఇంటికి వచ్చేస్తారని అమ్మృతవల్లి అనుకోలేదు.

ఆమె, జగదాంబ డ్రాయింగ్ రూంలోకి వచ్చి కూర్చున్నారు. కులాసా కబుర్లు జరుగుతూ ఉండగానే అమ్మృతవల్లి లోపలకు వెళ్ళి డైనింగ్ టేబుల్ మీద ఫలహారాలు, కాఫీలు అన్నీ తీరుగా సర్దింది. అందరినీ లోనికి ఆహ్వానించింది. సురక్ష కూడా అక్కడికే వచ్చి చేరింది.

''మా అమృతం కూతురు సురక్ష'' అంది జగదాంబ, మూర్తికి పరిచయం చేస్తూ. లేత తమలపాకులా ఉంది సురక్ష.

''నమస్కారం'' అంది. మూర్తి ఆమె చదువు, అభిరుచులు, ఆసక్తులు గురించి మాట్లాడుతూ ఉండిపోయాడు ఆ పిల్లతో. సురక్ష చాలా ఫ్రీగా మాట్లాడింది.

మూర్తి, సురక్ష ఆత్మీయంగా మాటలు కలుపుకోవడం జగదాంబకు ముచ్చట అనిపించింది. అమ్మృతవల్లితో ''చూశావా వాళ్ళ ధోరణి! సురక్షకు నేను చెప్పిన మాటలు బాగా నచ్చాయన్న మాట'' అంది. ఆడపిల్లలు అతిశయాలకు పోకుండా, ఉన్నంతలో జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని ఆమె సురక్షకు అంతకుముందే బోధ చేసింది.

ఓ గంటపాటు సత్కాలక్షేపం చేసి వాళ్ళు ముగ్గురూ వెళ్ళిపోయారు. ''రేపు ఆదివారం మా ఇంటికి రావాలి మీరు ఇద్దరూ. సరిగ్గా అయిదింటికి రండి. టి.వి. సినిమా మా ఇంట్లోనే చూడవచ్చు. మూర్తిని కూడా రమ్మంటాను'' అంది జగదాంబ, ప్రత్యేకంగా సురక్ష వైపు చూస్తూ వెళ్ళేముందు.

వాళ్ళిద్దరికీ మరింత అవగాహన ఏర్పడడానికి అది రెండో అవకాశం అవుతుందని ఆమె దృష్టి. ఇంకో వారం గడిచిపోయింది.

మూర్తి ఆఫీసునుంచే ఫోన్ చేశాడు, ''ఈ సాయంత్రం వస్తున్నాను. మీతో తీరుబడిగా మాట్లాడాలి. పిన్నిగారు ఊళ్ళోనే ఉన్నారుగా'' అని.

సాంబశివరావు ''అలాగే, రా. మరేం హడావిడి లేదు. తొందరపడి నిర్ణయం చేసుకోకు'' అని ఎప్పటి పాటే అప్పగించాడు.

ఆ సాయంత్రం మూర్తి వాళ్ళిద్దరికీ చెప్పేశాడు.

''మీరు నన్ను మన్నించాలి. మీ ఆలోచనలకు వ్యతిరేకంగా నేనో నిర్ణయానికి వచ్చాను.''

''నిర్ణయం ఎప్పుడూ నీదే. దాని కోసం నువ్వేం ఎపాలజెటిక్‌గా ఫీలవనక్కర్లేదు'' అన్నాడు సాంబశివరావు. జగదాంబకు మాత్రం గుండెలు గుబేలుమన్నాయి. అమ్మృతవల్లి ఆశలు తీరేనా? కుమార్తె జీవితాన్ని ఆమె తీర్చి దిద్దగలిగేనా?

''కొసాకి వినండి సార్. బాగా ఆలోచించుకున్నాక, నాకు న్యాయమని తోచిన నిర్ణయం ఏమిటంటే...'' అంటూ మొదలుపెట్టాడు మూర్తి.

జగదాంబకు ఒళ్ళంతా చెవులయిపోయాయి.

''నేను - ఆమె ఒప్పుకుంటే - అమ్మృతవల్లిగారినే పెళ్ళి చేసుకుంటాను, ఆమె కూతుర్ని కాదు. ఆమెకు నాకంటే ఒకటి రెండు సంవత్సరాలు తక్కువ వయసే అనుకుంటాను. కాస్తో కూస్తో పెద్దదయినా నాకేం అభ్యంతరం లేదు. జీవితంలో ఆమె మటుకు ఏం సుఖపడింది కనుక? కుమార్తె గురించి బెంగ సహజమే అనుకోండి. అయినా, ఆమె ఒప్పుకుంటే, నేను సురక్ష విషయంలో పూర్తి బాధ్యత తీసుకుంటాను. అమ్మృతవల్లి కంటే ఎక్కువగా నేను సురక్షకు తండ్రిని అవుతాను. తగిన వరుని చూసి వివాహం జరిపించే బాధ్యత నాది. అందుకు మీ సహకారం కూడా కావాలనుకోండి. అమ్మృతవల్లిగారికి ఈ విషయం చెప్పండి. ఆమె అంగీకరించేట్లు చేయడం పిన్నిగారికి తేలిక!'' అన్నాడు మూర్తి ఒక్కబిగిని.■